క్లుప్తంగా

వేమారెడ్డి పరామర్శ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ 17వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకుడి కుమార్తెకు రోడ్డు ప్రమాదం జరగడంతో గురువారం ఆ పార్టీ మంగళగిరి సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. మొహమ్మద్ సర్దార్ రెండవ కుమార్తెకు రోడ్డు ప్రమాదంలో కాలికి ఫ్రాక్చర్ కావడంతో శస్త్ర చికిత్స తీసుకుంది. వేమారెడ్డి ఇంటికి వెళ్లి చాందినిని పరామర్శించారు. నాయకులు బాల స్వామి, ఎండీ ఫిరోజ్ ఉన్నారు.

దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలోని మాజీ వలంటీర్ చింతాబత్తిన విజయ్ వివాహానికి దొంతిరెడ్డి వేమారెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులను ఆశీర్వదించారు. శాప్ మాజీ డైరెక్టర్ చింతాబత్తిన బాబూరావు ఉన్నారు.

పరిశుభ్రతపై బాలికలకు అవగాహన

మంగళగిరి: బాలికలు ఋతు క్రమ పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఇందిరా నగర్ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష అన్నారు. గురువారం అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని పాఠశాలల్లో బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిశుభ్రత వల్ల అనారోగ్యం బారిన పడకుండా ఉండొచ్చన్నారు.

బాల్య వివాహల నిరోధానికి ప్రతిజ్ఞ



ఫిరంగిపురం: బాల్య వివాహాలను ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని సర్పంచ్ ఎం.శివ కుమారి పేర్కొన్నారు. వేమవరం ప్రాథమిక పాఠశాలలో గురువారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహం ఒక సాంఘిక దురాచారమని, బాలికల కలలను సాకారం చేసుకునే అవకాశాలు కల్పించాలని సర్పంచ్ తెలిపారు. కార్యదర్శి శౌరి జోజప్ప, హెచ్ఎం కమల్ మోహన్, సిబ్బంది యశోద, పద్మ, వీరమ్మ, విజయకుమారి పాల్గొన్నారు.

రేపే పింఛన్ల పంపిణీ



తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని సామాజిక పింఛన్లను శనివారం పంపిణీ చేయనున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా గురువారం తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో.. పింఛన్ల పంపిణీ ఒక రోజు ముందు చేయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 6 నుంచే పంపిణీ జరుగుతుందన్నారు. మొత్తం 12,977 మంది పింఛనుదారులకు రూ.5,52,62,000ను 251 మంది సచివాలయ, నగరపాలక సిబ్బందితో పాటు 13 మంది పర్యవేక్షణాధికారులు పింఛను నగదు పంపిణీ చేస్తారని చెప్పారు.

ఓటు హక్కుపై అవగాహన

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ జె.ప్రసాదరావు అన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలలో గురువారం ఓటర్ల చైతన్య కార్యక్రమం(స్వీప్) నిర్వహించారు. 1950 జనవరి 25న భారత ఎన్నికల సంఘం ఏర్పడినట్లు తెలిపారు. ఫామ్-6 ద్వారా ఓటు నమోదు, ఫామ్-7 ద్వారా మృతుల ఓట్ల తొలగింపు, ఫామ్-8 ద్వారా చిరునామా మార్పు తెలియజేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది, బీఎల్‌వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

లక్ష్మీపురం: అనారోగ్యంతో మానసిక ఒత్తిడికి లోనై వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారత్ పేట 4/2 వ లైన్ ప్రాంతానికి చెందిన శ్రావణి (28), చెన్నారెడ్డికి 12 సంవత్సరాలు క్రితం వివాహమైంది. చెన్నారెడ్డి ఎక్సైజ్ విభాగం ల్యాబ్‌లో పని చేస్తారు. పాప, బాబు ఉన్నారు. శ్రావణి అనారోగ్య కారణంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. కుటుంబ సభ్యులకు భారం అవుతున్నానని చెబుతూ బాధపడేది. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో గదిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహ్యత చేసుకుంది. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. భర్త చెన్నారెడ్డి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేశారు.

పెన్షనర్లు, వేతన జీవులకు వెతలు

కొరిటెపాడు(గుంటూరు): వేతన సవరణ సంఘం సిఫార్సులు అమలు, కమిషన్ రిపోర్టు ఇవ్వటంలోనూ ప్రతిసారీ జాప్యం జరగటంతో పెన్షనర్లు, వేతన జీవులకు తీవ్ర నష్టం కలుగుతోందని రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చా వేదిక అధ్యక్షులు ఈదర వీరయ్య గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు.

సమ సమాజం కోసం పూలే కృషి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు



నివాళులర్పిస్తున్న షేక్ సుభాని



పూలే చిత్రపటానికి సీపీఎం నాయకుల నివాళి



పూలే చిత్రపటానికి ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి నివాళి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సమన్వయకర్త బాల వజ్రబాబు

మంగళగిరి: సమ సమాజం కోసం జ్యోతిరావు పూలే కృసి చేశారని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంత రావు పేర్కొన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పూలే వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ సమాజం కొరకు పోరాడిన పూలే ఆశయాలు నెరవేరాలంటే మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావాలని ఆకాంక్షించారు. సమాజంలో పురుషులతో పాటు మహిళలు సమానంగా రాణించాలన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, నాయకులు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, కుంచాల కృష్ణ కిషోర్, ఆంజనేయులు, జాలాది నాగేశ్వరరావు, మాన్యం నాగేశ్వరరావు, సుభాని, వడ్డేశ్వరపు రజనీకాంత్, గుంటి రాజ్యలక్ష్మి, మిట్టా నిర్మల, విక్కీ, ప్రదీప్ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. గురువారం దుగ్గిరాల జెండా చెట్టు సెంటర్ వద్ద జ్యోతిరావు పూలే 134వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం మట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలనకు, అసమానతలు లేని సమాజం, అణగారిన వర్గాల హక్కుల కోసం ఎనలేని కృషి చేసి వ్యక్తి జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ జాన్ సైదా, షేక్ అబ్దుల్ సమద్, షేక్ జిలానీ, కాకా వెంకటేశ్వర్లు, బులుసుపాటి ఏలేశ్వరరావు, చందోలు సత్యనారాయణ, పితాదేవ ప్రసాద్, నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి: పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పిలుపునిచ్చారు. గురువారం పూలే వర్ధంతి సందర్భంగా సంఘం కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. నాయకులు పారేపల్లి మహేష్, శివరామ్ బాబాజీ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : గొప్ప సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిరావు పూలే అని సీపీఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమరారెడ్డి భవన్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, కొట్టె కరుణాకర్‌రావు, కట్ట మేరి, గంజి శ్రీనివాస రావు, ఫిరోజ్ పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్ : అట్టడుగు శ్రమ జీవుల హక్కుల కోసం పోరాడిన జ్యోతిరావు పూలే ఆశయ సాధన కోసం పోరాడడం అంటే ఆయన ఆలోచనలను అర్థం చేసుకుని, ఆచరించడమని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం ఐద్వా కార్యాలయంలో పూలే వర్ధంతి సభను నిర్వహించారు. ముందుగా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ గంజాయిని వంద రోజుల్లో నిర్మూలిస్తామన్న మాటలు కేవలం ప్రగల్భాలుగా మారాయని, ఇప్పుడు పేదల సంక్షేమ పథకాలకు ఎసరు పెట్టారని, బిడ్డలు, భర్త గంజాయికి మద్యానికి బలతుంటే తల్లులు నిస్సహాయంగా రోదిస్తున్నారని ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. డిసెంబర్ 10వ తేదీ వరకు వెర్రి తలలు వేస్తున్న విష్క సంస్కృతిని నిరసిస్తూ విస్తృత ప్రచారం చేయాలని రాష్ట్ర కమిటీ మహిళలకు పిలుపునిచ్చారు. కందిపప్పు, నూనె చౌక దుకాణాల ద్వారా సరఫరా చేస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం తన వాగ్ధానాన్ని ఇంతవరకు అమలు చేయకపోవడాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభావతి, సత్యవతి, శ్రీనివాసకుమారి, పూర్ణ, రమణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ: స్త్రీ విద్యకు ప్రాధాన్యతనిచ్చి, వారి కోసం ప్రత్యేక పాఠశాల ఏర్పాటు చేసిన సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతీరావు పూలే అని వైఎస్సార్‌సీపీ తాడికొండ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతీరావు పూలే వర్ధంతిని గుటూరులోని తన కార్యాలయంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు, సామాజిక ఉద్యమకారుడు జ్యోతీరావు పూలే కొనియాడారు. నేడు రాష్ట్రంలో హక్కులను హరిస్తూ, ఆరాచక పాలన కొనసాగుతోందని విమర్శించారు. ప్రశ్నించే గొంతులను అణిచివేసే ధోరణిలో కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు.

- జ్యోతీరావు పూలే వర్ధంతిని తుళ్ళూరు మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. మండల మాజీ అధ్యక్షుడు బత్తుల కిషోర్, బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు గుమ్మా పూర్ణచంద్రరావు, బొమ్మా శ్రీనులు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివిధ విభాగాల నాయకులు నాయుడు నాగేశ్వరరావు, కాకర్ల నాగేశ్వరరావు, మిట్టనోసుల కోటేశ్వరరావు, కొప్పుల శేషగిరిరావు, ఆరేపల్లి జోజి, పుట్టి సుబ్బారావు, తుమ్మూరు ప్రసాదరెడ్డి, జొన్నకూటి ప్రశాంత్, చనుమోలు రామారావు, తోకల రాఘవులు, అన్నూరు జక్రయ్య, బెజ్జం ప్రకాష్ పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు



వ్రతాన్ని ఆచరింపజేస్తున్న ఆగమ పండితులు



సామూహిక వ్రతంలో పాల్గొన్న దంపతులు

తెనాలి: స్థానిక షరాఫ్‌బజార్‌లోని శ్రీసువర్చలాసమేత శ్రీపంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం 11వ ఉచిత సామూహిక శ్రీరమాసహిత శ్రీ సత్యనారాయణస్వామి వ్రత మహోత్సవం నిర్వహించారు. శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్, శ్రీపంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శ్రీసత్యదేవ వ్రతమహోత్సవంలో 111 మంది దంపతులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని భక్తిశ్రద్ధలతో వ్రతాన్ని ఆచరించారు. ఆలయ వంశపారంపర్య అర్చకుడు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైఖానస ఆగమ పండితులు నారాయణం గోవర్ధన లక్ష్మీ రఘురామ్, వేదాంతం నాగమారుతి, అద్దేపల్లి హరికృష్ణ వైదికక్రతువును ఆగమోక్తంగా జరిపించారు. సత్యదేవ వ్రత విశిష్టతను వివరించారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ పవిత్ర కార్తిక మాసాన ఆలయంలో ఉచిత శ్రీసత్యదేవవ్రతాల నిర్వహణ, భక్తులు విశేషంగా పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు. భక్తులందరికీ శ్రీ సత్యదేవుని ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ వ్యవస్థాపకులు ఆర్‌వీ కిరణ్ కుమార్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎస్‌బీ.శివ, నిఖిల్ శాండిల్య, దేవాదాయ శాఖ ఈ.వో హరిప్రసాద్, కౌన్సిలర్ పి.త్రిమూర్తి, శ్రీ విఖనస శ్రీనివాస ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ , జంధ్యం రామారావు, మడుపల్లి చంద్రశేఖర్, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనూరాధ, సేవాసమితి సభ్యులు మాజేటి వెంకటేష్, కట్టమూరీ రమణకుమార్, గోలి సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సినీ హీరో గల్లా అశోక్‌కు సత్కారం



తాడేపల్లిరూరల్ : గుంటూరు నుంచి విజయవాడ వెళ్తున్న సినీ హీరో గల్లా అశోక్‌కు తాడేపల్లి బైపాస్ రోడ్‌లోని మణిపాల్ హాస్పిటల్ వద్ద టీడీపీ నాయకులు కొమ్మారెడ్డి కిరణ్, జంగాల వెంకటేష్ గురువారం స్వాగతం పలికారు. అశోక్ గల్లా నటించిన దేవకీ నందన వాసుదేవ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టీడీపీ నాయకులున్నారు.

తాడికొండ ఎస్‌గా జీత్యా నాయక్



తాడికొండ: తాడికొండ ఎస్ఐగా జీత్యా నాయక్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నెల్లూరు జిల్లాలో ఎస్ఐగా పనిచేసిన ఆయన తాడికొండలో పోస్టింగ్ ఇవ్వడంతో గురువారం బాధ్యతలు స్వీకరించారు. తాడికొండ సీఐ కె.వాసుకు రిపోర్ట్ చేసి విధుల్లో చేరారు.

రేపు భారత రాజ్యాంగం మంచీచెడుపై చర్చాగోష్టి

తెనాలి: భారత రాజ్యాంగ వజ్రోత్సవాల సందర్భంగా ఈనెల 30న తెనాలిలో 'బారత రాజ్యాంగం: మంచి-చెడు' అంశంపై చర్చాగోష్టి జరగనుంది. పట్టణ సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఏర్పాటయే సభకు మానవ హక్కుల వేదిక జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రాజనీతిశాస్త్ర ఆచార్యు వి.అంజిరెడ్డి, విప్లవ రచయితల సంఘం నాయకుడు సీఎస్ఆర్ ప్రసాద్ చర్చను ప్రారంభిస్తారని గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

టీసీఎస్‌కు ఎంపికైన ఏఎస్ఎన్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులకు చైర్మన్ శివకుమార్, డాక్టర్ రామ్‌చంద్

తెనాలి: 2024-25 విద్యాసంవత్సరంలో తొలిగా క్యాంపస్ ఇంటర్వ్యూలను చేసిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ టీసీఎస్‌కు స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజి ఫైనలియర్ విద్యార్థులు ఏకంగా 68 మంది ఎంపికయ్యారు. ఏఎస్ఎన్ విద్యాసంస్థల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ గురువారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. టీసీఎస్ సంస్థ దేశవ్యాప్తంగా జరిపిన జాతీయ క్వాలిఫైడ్ టెస్ట్‌లో ఎంపికైన వారికి విజయవాడలో ఇంటర్వ్యూలను చేసినట్టు తెలిపారు. ఎంపికై న విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.60 లక్షలుగా చెప్పారు. ప్రపంచ ఆర్థికమాంద్యం పరిస్థితుల్లోనూ ఉద్యోగ అవకాశాలు తగ్గినప్పటికీ కాలేజి విద్యార్థులకు జీవనకళలు, వర్చువల్ సర్టిఫికెట్ కోర్సులను నిర్వహిస్తూ, గరిష్టంగా ఉద్యోగాల సాధనకు తోడ్పడుతున్నట్టు చెప్పారు. నాణ్యమైన విద్యను అందిస్తూ ఉపాధి కల్పనకు కాలేజీ వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి విద్యార్థికి ఉద్యోగం ఆశయాని నెరవేరుస్తున్న కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్, అధ్యాపకులను, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను శివకుమార్ అభినందించారు.

స్వశక్తితో విద్యార్థులంతా ఎదగాలి



గుంటూరు రూరల్: విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందివచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చుకుని, స్వశక్తితో ఎదిగి పరిశ్రమల స్థాపన దిశగా పయనించి పది మందికి ఉపాధి కల్పించాలని గ్రేడ్- 1 మినిస్ట్రీస్ ఆఫ్ ఇండియా ఎంఎస్ఎంఈ అసిస్టెంట్ డైరెక్టర్ కేసీ చౌదరి తెలిపారు. నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, ఎంటర్‌పెన్యూర్‌గా ఏ విధంగా ఎదగాలి అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు నూతన స్కీమ్స్‌ను ఎంఎస్ఎంఈకి అందజేస్తే వారికి కావాల్సిన పెట్టుబడి పొందవచ్చని తెలిపారు. నమ్మకం, పట్టుదల, కష్టపడేతత్వం పెంపొందించుకోవాలని సూచించారు. చిన్న పరిశ్రమలు స్థాపించి పదిమందికి ఉద్యోగాలను అందించవచ్చని, సమాజాభివృద్ధికి దోహదపడవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. చంద్రశేఖర్, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ చందు రవిశంకర్ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలివ్వకుంటే ఉద్యమం



దరఖాస్తులు స్వీకరిస్తున్న సీపీఐ నాయకులు

మంగళగిరి: పేదలందరికి ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని సీపీఐ నాయకుడు జంగాల అజయ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో నాయకులతో కలిసి గురువారం పర్యటించి, పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అజయ్ కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు నిర్మించి ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఆచరణలో మాత్రం అశ్రద్ధ చూపుతోందన్నారు. వెంటనే ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలం కేటాయించి, గృహ నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, బొర్రా మల్లి కార్జున రావు, జాలాది నాగేశ్వరరావు, కుక్కమళ్ల నాగేశ్వర రావు, కఠారి జేసుదాసు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు మద్దతు



కార్మికులకు మద్దతు తెలిపి, మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మనందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి పీడీఎఫ్ తరుపున సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. గురువారం కార్మికుల దీక్షా శిబిరం వద్దకు విచ్చేసి, న్యాయమైన పోరాటం గెలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ముఖ్యంగా మంత్రి నారా లోకేష్ ఎన్నికలకు ముందు ఈ ప్రాంతంలో ప్రచారం నిర్వహించి, సిమెంట్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన సంగతి గుర్తుచేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, పరిశ్రమల శాఖ మంత్రి, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి, కార్మిక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్‌ను కలసి వినతి పత్రాలు అందజేస్తామని కార్మికులకు తెలిపారు. 30 ఏళ్ల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ పోరాటం ఎన్నో అనుభవాలను కార్మిక కుటుంబాలకు మిగిల్చిందని, ఫ్యాక్టరీ ప్రారంభంలో 330 మందికార్మికులు పనిచేసి, దేదీప్యమానంగా ఒక వెలుగు వెలిగిన ఈ ప్రాంతం నేడు శూన్యత సంతరించుకుందన్నారు. ఇప్పటి వరకు 170 మంది కార్మికులు అర్ధాకలితో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.అంకయ్య, కె. ఆదినారాయణ, యెహోషువా, సాంబయ్య, సూర్య ప్రకాష్, సుబ్బారావు, ఎస్‌కె బాష, ఆసిఫ్, నవనీతం, దుర్గమ్మ, రమాదేవి, శారద, శారమ్మ, సామ్రాజ్యం, సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేములు దుర్గారావు, బూరగ వెంకటేశ్వర్లు, సిపిఎం నాయకులు దొంతిరెడ్డి వెంకట్ రెడ్డి, జొన్న శివశంకరరావు, ఏ జగన్, ఎల్. సత్యం, రామారావు, నరసింహారావు, ఎస్. దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్‌పై ఆంధ్ర జట్టు ఆధిక్యం



7 వికెట్లు తీసిన రితిక్ ధూమ్ (ఉత్తరాఖండ్)



7 వికెట్లు తీసిన ఏఎన్‌వీ లోహిత్ (ఆంధ్ర)

మంగళగిరి: నగర పరిధిలోని అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న కూచ్ బెహరా అండర్ -19 క్రికెట్ ట్రోఫీలో ఆంధ్ర జట్టు ఉత్తరాఖండ్ జట్టుపై ఆధిక్యం సాధించింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు 48.4 ఓవర్లలో 139 పరుగులకు ఆలౌటైంది. ఉత్తరాఖండ్ జట్టు బౌలర్ రితిక్ ధూమ్ ఏడు వికెట్లు తీసి ఆంధ్రా జట్టును కుప్పకూల్చాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఉత్తరాఖండ్ జట్టు 18.4 ఓవర్లలో 85 పరుగులకే ఆలౌటైంది. ఆంధ్ర జట్టు బౌలర్ ఏవీఎస్‌లోహిత్ ఏడు వికెట్లతో రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర జట్టు 19 ఓవర్లలో ఒక వికెట్ నష్టపోయి 76 పరుగులు సాధించింది. తొలి రోజు ఆంధ్ర జట్టు తన ఆధిక్యాన్ని చాటుకుంది.

టెన్నిస్ క్రీడాకారుడు మహేష్‌కు అభినందన



తెనాలిరూరల్: ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ ఆధ్వర్యంలో ఈనెల 22 నుండి 25 వరకు చత్తీస్‌గఢ్‌లో జరిగిన టెన్నిస్ టోర్నమెంట్‌లో విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తితో కలసి పాల్గొన్న తెనాలి టైన్ మ్యాన్ కొమరాగిరి మహేష్ జాతీయ స్థాయిలో రన్నర్స్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మహేష్‌ను పలువురు అభినందించి సత్కరించారు. టెన్నిస్ క్రీడాకారుడైన త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు అఫీషియల్స్ క్లబ్‌లో గురువారం క్లబ్ సభ్యులతో కలసి శాలువా పూలమాలలతో మహేను సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు పొందాలని ఆకాంక్షించారు.

శివకుమారి మృతికి సంతాపం



తెనాలిఅర్బన్: విధి నిర్వహణలో బాధ్యతహితంగా శివకుమారి ఉండేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి కొనియాడారు. నందుపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో ఇటీవల మృతి చెందిన ఆశా కార్యకర్త శివకుమార్ చిత్రపటానికి గురువారం ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల, వైద్యాధికారిణి డాక్టర్ దేవరపల్లి సుభాష్ రమాదేవి, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్ర మౌళి, హెల్త్ విజిటర్ చింతల ప్రసన్న పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తే చర్యలు తప్పవు

మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకున్న కమిషనర్

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న హెచ్చరించారు. మున్సిపల్ మార్కెట్‌లో ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న వ్యాపారిపై గురువారం ఆగ్రహం వ్యక్తం చేసి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 మైక్రాన్‌లోపు ఉన్న ప్లాస్టిక్ కవర్లను విక్రయించడాన్ని ప్రభుత్వం నిషేధించిందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాటిని అమ్మిన, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యాపారులు ఎవరు తక్కువ రకం ప్లాస్టిక్‌ను విక్రయించవద్దని సూచించారు. ఆయన వెంట పలు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.